క్లుప్తంగా

వైభవుని సన్నిధిలో పవిత్రోత్సవాలు ప్రారంభం



శేషాచార్యునికి పవిత్రాలు అందిస్తున్న భక్తులు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం నాలుగో సోమవారం పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా తొలి రోజున ఉదయం 5 గంటలకు స్వామి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం ప్రాతఃకాలార్చన, బాలభోగం, మంగళాశాసనము, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. ముందుగా ఆలయ కార్యనిహర్వహణాధికారి బందారు ప్రసాద్, భక్తులు నాగరాజు, సురేష్ కుమార్, ఉమాపతి దంపతులు పవిత్రాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం అర్చకుడు జి.శేషాచార్యులకు సమర్పించారు. వాటిని వైభవుని వద్ద ఉంచి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

కుమార్తె చెంతకు తల్లి



కుమార్తెకు తల్లిని అప్పగిస్తున్న జ్యోతిర్మయి

సీతమ్మధార : దీనమైన స్థితిలో రోడ్లపై తిరుగుతున్న వృద్ధురాలు నరసమ్మ (75)ను ఆమె కుమార్తెకు అప్పగించారు. ఉక్కునగరం పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండగా స్థానికుడు చెల్లూరి భాస్కరరావు పోలీసుల సాయంతో ద్వారకానగర్‌లో గల జీవీఎంసీ – ఏయూటీడీ వసతిగృహానికి సోమవారం తరలించారు. ఆమె ఊరు పేరు పాలవలస అని మాత్రమే చెప్పడంతోపాటు, అంతకు మించి వివరాలు చెప్పలేకపోవడంతో అక్కడే ఉంచారు. ఇంతలో తల్లి కోసం వెతుక్కుంటూ ఆమె కుమార్తె ఇనపకుర్తి లక్ష్మి ఎయిర్‌పోర్టు జోన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ షేక్ మదీనాతో కలిసి షెల్టర్‌కు రావడంతో మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్స్ ప్రశాంత్, శ్రీనివాస్ కలిసి నరసమ్మను అప్పగించారు.

మ్యూజియంగా మార్చాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

సీతమ్మధార : రుషికొండలో నిర్మించిన భవనాలను మ్యూజియంగా మార్చాలని బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వారు సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్ వద్ద గల బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకి సోమవారం వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం.మల్లయ్యరాజు, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ, బి.బాలరాజు, ఆర్.ఎస్.నారాయణ, వెంకటేశ్వరరావు, సి.రాంజీ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణంపై ఫిర్యాదు

సీతమ్మధార : గెడ్డ స్థలంలో ప్రహరీ నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం సీతమ్మధారలో గల కార్యాలయంలో తహసీల్దార్ ఎం.రమేష్‌ని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలోని మధురానగర్‌లో సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. ఇక్కడి గెడ్డ స్థలం ఆక్రమించి ప్రహరీ నిర్మించడంతో స్థానికులతోపాటు మధురానగర్ నుంచి ద్వారకానగర్ వైపు రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడతారని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్తీక దీపోత్సవం రేపు

సీతమ్మధార : క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం బుధవారం సాయంత్రం నిర్వహిస్తామని సమితి అధ్యక్షుడు దాట్ల తిరుపతి రాజు, కార్యదర్శి ఆర్.వి.గణపతిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతమ్మధారలో గల క్షత్రియ కల్యాణ మండపంలో దీపోత్సవం, శివారాధన, లక్ష్మీనారాయణపూజ, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి ప్రసంగం, భక్తులకు ప్రసాద వితరణ చేస్తామని తెలిపారు. భక్తులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



ట్రాఫిక్ పద్మవ్యూహం

- అంతా వ్యాపారుల ఇష్టారాజ్యం
- చోద్యం చూస్తున్న జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు

అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డుపైనే వ్యాపారాలు

సీతంపేట : ప్రధాన రహదారుల్లో కొంత మంది ఇష్టారాజ్యంగా **చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ** ట్రాఫిక్ ఇక్కట్లకు **కారణమవుతున్నారు. రోడ్డుకు** ఇరువైపులా **చిరు వ్యాపారులు సగానికి పైగా రహ**దారిని ఆక్రమించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆక్రమణలు తొలగించాల్సిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీస్ విభాగాలు చోద్యం చూస్తున్నాయి. ఫిర్యాదులు వచ్చినపుడు, పత్రికల్లో వార్తలు ప్రచురించినపుడు హడావిడి చేసి వ్యాపారాలు తొలగించడం, మర్నాడు నుంచి యథావిధిగా వ్యాపారాలు కొనసాగించడం ఆనవాయితీగా మారింది. రోడ్డుపై వ్యాపారాలు నిర్వహించే వారి నుంచి అందుతున్న రోజు వారీ, నెలవారీ మామూళ్ల కారణంగానే సంబంధిత విభాగాల అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

రోడ్డు విస్తరించినా ట్రాఫిక్ అవస్థలు

ట్రాఫిక్ సమస్యలు అధిగమించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ విస్తరణ పనులు చేపట్టారు. 2004 మాస్టర్ ప్లాన్ ప్రకారం రూ.12.50 కోట్ల వ్యయంతో హైవే నుంచి దొండపర్తి కూడలి వరకు విస్తరించి, రోడ్‌కు ఇరువైపులా పాదచారులు నడిచేందుకు ఫుట్‌పాత్‌లు నిర్మించారు. హైవే నుంచి మహారాణి పార్లర్ కూడలి **వరకు 80 అడుగుల రోడ్‌గా, మహారాణి పార్లర్ నుంచి దొండపర్తి కూడలి వరకు 60 అడుగుల రోడ్‌గా విస్తరణ, బ్యూటిఫికేషన్ చేపట్టారు. కోట్లాది రూపాయల వ్యయంతో రోడ్ విస్తరించినప్పటికీ** ట్రాఫిక్ సమస్యలు మాత్రం వెంటాడుతూనే ఉన్నాయి. సాయంత్రం వేళల్లో, సెలవు రోజులు, ముఖ్యమైన పండగల రోజుల్లో అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో ప్రయాణించడం పద్మవ్యూహాన్ని తలపిస్తోందని పలువురు ఆందోళన చెందుతున్నారు. చిరు వ్యాపారులు రోడ్లను ఆక్రమించడమే ఇందుకు ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు. పాదచారులు నడవడానికి వీలు లేకుండా షాపుల యజమానులు ఫుట్‌పాత్‌లు అక్రమించేశారు. ఫుట్‌పాత్ నుంచి పది అడుగుల మేర రోడ్‌ను చిరు వ్యాపారులు ఆక్రమించేశారు. దీంతో షాపులు, చిరు వ్యాపారుల వద్దకు కొనుగోలు చేసేందుకు వచ్చే వినియోగదారుల ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో మెయిన్ రోడ్డు మరింత ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారిలో రోడ్‌ను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా ఇటు జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం, ట్రాఫిక్ పోలీస్ విభాగం చోద్యం చూస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.





సంఘం ఆఫీస్ కూడలి వద్ద వాహనాల రద్దీ (ఇన్‌సెట్) అదే ప్రాంతంలో రోడ్డుపై చిరు వ్యాపారుల బళ్లు

మామూళ్ల మత్తులో అధికారులు

ఎరుకుమాంబ ఆలయం, సంఘం ఆఫీస్, జగ్గారావు బ్రిడ్జి, మహారాణి పార్లర్, రిజిస్ట్రార్ ఆఫీస్ ప్రాంతాల్లో చిరు వ్యాపారాల నిర్వహణ అధికంగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు జీవీఎంసీ 26, 27, 42, 43, 44వ వార్డుల పరిధిలోకి వస్తుంది. ఆయా వార్డుల పరిధిలో ఆక్రమణలు నియంత్రించడానికి టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు ఉన్నారు. అలాగే జోన్ 3, 5లో టీపీవో, టీపీఎస్, ఏసీపీ ఉన్నారు. ఎవరూ అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో ట్రాఫిక్ సమస్యపై గానీ, ఆక్రమణలపై గానీ దృష్టి సారించకుండా మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాలు సాఫీగా ప్రయాణించేలా కోట్లాది రూపాయలు వెచ్చించి విస్తరించిన రహదారులు ఆక్రమణకు గురవడంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు విస్తరించినా ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, పోలీస్‌లు దృష్టి సారించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. చిరువ్యాపారులకు హాకర్ జోన్స్ ఏర్పాటు చేసి ప్రధాన రహదారుల్లో సాఫీగా ప్రయాణానికి మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు

కానరాని హాకర్ జోన్లు

రహదారి ఆక్రమణలను, ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడానికి తోపుడుబళ్ల వ్యాపారులను ఒకచోటకు చేర్చేలా జీవీఎంసీ హాకర్‌జోన్లు ఏర్పాటు చేస్తామని చేసిన ప్రకటనలు సంవత్సరాలు గడిచినా నేటికీ అమలుకు నోచుకోవడం లేదు. ప్రతి వార్డులో చిరు వ్యాపారులు, తోపుడుబళ్ల వ్యాపారుల వివరాలు గతంలో సేకరించారు. వారికి గుర్తింపు కార్డులు కూడా ఇచ్చారు. హాకర్ జోన్లు మాత్రం ఇంతవరకు ఏర్పాటు కాలేదు. నగరంలోకి వచ్చే ప్రధాన రహదారులైన అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, శంకరమఠం రోడ్, సీతంపేట, రామాటాకీస్ రోడ్ ప్రాంతాల్లో తోపుడుబళ్ల వ్యాపారులకు, చిరు వ్యాపారులకు హాకర్‌జోన్స్ కేటాయిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు అంటున్నారు.



జగ్గారావు బ్రిడ్జి వద్ద అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

నడవాలంటే భయమేస్తోంది



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో నడవాలంటే భయమేస్తోంది. రోడ్డు ఎంత వెడల్పు చేసినా నడవడానికి వీలు లేకుండా పోయింది. ఫుట్‌పాత్‌లను షాపుల వాళ్లు ఆక్రమించేశారు. విశాలమైన రోడ్లను టిఫిన్, పువ్వులు, పండ్లు, చిరుతిండి బళ్లు, కూరగాయలు, పూజా సామాగ్రి విక్రయించే వ్యాపారాలు ఆక్రమించేశారు. సాయంత్రమైతే వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ అయిపోతోంది. అధికారులు దృష్టి సారించి ఫుట్‌పాత్‌లు, మెయిన్ రోడ్డుపై ఆక్రమణలు తొలగించాలి.

– ఎల్.రామునాయుడు, అక్కయ్యపాలెం.

హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలి



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో సగ భాగం చిరు వ్యాపారులు ఆక్రమించేశారు. ప్రధాన రహదారుల్లో వాహనాలు సాఫీగా ప్రయాణించేలా మార్గాలు చూడాలి. చిరు వ్యాపారులకు అన్యాయం జరగకుండా హాకర్ జోన్స్ ఏర్పాటు చెయ్యాలి. నగరం రోజురోజుకీ అభివృద్ధి చెందుతోంది. వాహనాల సంఖ్య పెరిగింది. దానికి తగినట్టు రోడ్లు విస్తరించినా ట్రాఫిక్ సమస్య మాత్రం దూరం కావడం లేదు.

– సరస్వతి, అక్కయ్యపాలెం

అథ్లెటిక్స్‌లో బుల్లయ్య కళాశాల విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట : ఆంధ్రా యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో నిర్వహించిన అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పురుషులు, మహిళల చాంపియన్‌షిప్ పోటీల్లో బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. ఈఈఈ తృతీయ సంవత్సరం చదువుతున్న స్రవంతి డిస్కస్ త్రోలో, హామర్ త్రోలో బంగారు పతకాలు సాధించింది. ప్రసన్నకుమారి, ఢిల్లేశ్వరి, మోహానాంజలి, స్రవంతి 400 మీటర్ల రిలే రేసులో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.దీపక్‌చౌదరి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ యు.గంగాభవానీ పాల్గొన్నారు.

రూ.49.98 లక్షలతో బాక్సు కల్వర్టు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ ఉషశ్రీ, తదితరులు

సీతంపేట : జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో కర్రివాని గెడ్డపై కల్వర్టు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెడ్డపై ఉన్న కల్వర్టు శిథిలమవడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడిందని, పాత కల్వర్టు తొలగించి బాక్సు కల్వర్టు నిర్మిస్తారన్నారు. పాత కల్వర్టు కంటే వెడల్పుగా నిర్మించేందుకు రూ.49.98 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, జనసేన నార్త్ ఇన్‌చార్జి పి.ఉషాకిరణ్, బొడ్డేటి మోహన్, బొడ్డేటి శ్రీదేవి, కొయిలాడ వెంకటేష్, ఈఈ తారా ప్రసన్న, ఏఈ రమణమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించాలి



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జోన్ - 3 జెడ్సీ శివప్రసాద్, అధికారులు



అర్జీదారు నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న జోన్ - 5 జెడ్సీ రాము

కంచరపాలెం : ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జోన్ – 5 జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆదేశించారు. జ్ఞానాపురంలోని కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో పలు సమస్యలపై ఆరుగురి నుంచి ఆయన నేరుగా వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 03, రెవెన్యూకి 02, వాటర్ వర్క్స్‌కు సంబంధించి ఒక వినతి అందినట్లు తెలిపారు. జోన్ పరిధిలోని టౌన్ ప్లానింగ్‌పై అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని, వార్డు పర్యటనలోనూ ఇదే విభాగానికి సంబంధించి సమస్యలు కనిపిస్తున్నాయని ఏసీపీ, టీపీవోలు పర్యవేక్షించాలని జెడ్సీ సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఏపీడీవో ఎస్.పుణ్యవతి, ఏఈలు సుమన్, సతీష్ పాల్గొన్నారు.

సీతమ్మధార : సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ ఎం.రమేష్ ఏడుగురు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ప్రేమలత, సీనియర్ అసిస్టెంట్ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

జోన్–3 పీజీఆర్ఎస్‌కు ఐదు వినతులు

ఆశీలమెట్టలోని జోన్–3 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ఐదు వినతులు వచ్చాయి. జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ వీటిని స్వీకరించారు. జెడ్సీ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, డిప్యూటీ ఇంజినీర్ పద్మావతి, సహాయ వైద్యాధికారి డాక్టర్ భాస్కరరావు, టీపీవో గోపన్న, యూసీడీ విభాగం ఏపీడీ ఎల్.రాము, ఆర్‌వో పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగుతున్న వీధి లైట్లు



వరాహగిరి కాలనీలో వెలుగుతున్న వీధిలైటు

తాటిచెట్లపాలెం : సుమారు నెల రోజులుగా వెలగని వీధి లైట్లు సోమవారం వెలిగాయి. వీధి లైట్లు వెలగక ఎదురవుతున్న ఇబ్బందులపై ఇటీవల సాక్షిలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. మరమ్మతులు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

4న మహా అన్నసమారాధన



అలంకరణలో శివయ్య

సీతమ్మధార : జీవీఎంసీ 45వ వార్డు వరాహగిరి కాలనీ – 2లో ఉన్న అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వర దేవాలయంలో డిసెంబర్ 4న మహా అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త కేదారిశెట్టి ఆదిలక్ష్మి, ప్రధాన అర్చకులు అంబడిపూడి సుధీర్ కుమార్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా మహా శివుడిని సోమవారం ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక మాస ఆఖరి సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు పూజలు, అభిషేకాలు చేశారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న



ఏఎస్ఆర్ జిల్లా డీఎస్పీ భావన, ప్రమోద్ దంపతులను సత్కరిస్తున్న మురళీకృష్ణారెడ్డి

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం వద్ద గల శ్రీ శాంతి స్వరూపిణి దుర్గా అమ్మవారు ఆలయ ఆవరణలో కేఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్పస్వామి భక్తులకు అన్నదానం చేశారు. ట్రస్టు అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఏఎస్ఆర్ జిల్లా డీఎస్పీ భావన, ప్రమోద్ దంపతులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. అన్ని దానాల్లో అన్నదానం ఎంతో మిన్న అని కొనియాడారు. అంతకుముందు వారు దుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా 600 మంది మాలధారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ రంగంలో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న డీజీఎం సతీష్‌కుమార్

మురళీనగర్ : ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ రంగంలో అనేక ఉపాధి అవకాశాలున్నాయని అదానీ గంగవరం పోర్టు ఎలక్ట్రికల్ విభాగం డీజీఎం కె.సతీష్ కుమార్ అన్నారు. కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం 5వ సెమిస్టర్ విద్యార్థులకు నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించాలంటే సబ్జెక్టుపై పట్టు సాధించడంతో పాటు సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. ప్రవీణ్‌బా ఎలక్ట్రికల్ ట్రైనింగ్ సర్వీసెస్, ఓడిన్ కంట్రోల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా వర్క్‌షాప్ నిర్వహించారు. శిక్షణ విభాగం ట్రైనర్ టి.రవిచంద్రన్ విద్యార్థులకు ఎలక్ట్రికల్ విభాగంలో ఉన్న అవకాశాలు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కాలేజీ ఎలక్ట్రికల్ విభాగం హెడ్ కేడీవీ నరసింహారావు, కె.మహేష్, పి.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

శివాలయాలకు దీపకాంతుల శోభ

వైభవంగా కార్తీక సోమవారం పూజలు



అలంకరణలో స్పటిక లింగ శివుడు



రామకృష్ణానగర్‌లో ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరుడు



సీతంపేటలో ప్రత్యేక అలంకరణలో పార్వతీశ్వరుడు

సీతంపేట : కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతంపేటలోని పార్వతీశ్వరాలయం, రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయం వద్ద పరిసర ప్రాంతాల భక్తులు క్షీరాభిషేకాలు, అర్చనలు, ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. ఉపవాసం అనంతరం సాయంత్రం ఆలయాన్ని మరలా దర్శించుకుని పూజలు చేశారు. సీతంపేటలోని పార్వతీశ్వరుడు, రామకృష్ణానగర్‌లో రామలింగేశ్వరుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం మేళతాళాల మధ్య శివునికి రుద్ర హారతులిచ్చారు. ఆలయ ఈవో రమాభాయి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కంచరపాలెం : స్థానిక 104 ఏరియా బాపూజీనగర్, కోదండ కాశీవిశ్వేశ్వరాలయంలో అనువంశిక ధర్మకర్త ఎడ్ల శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు ఎం.సూర్యప్రకాశ్‌శర్మ, తిక్కవానిపాలెంలోని అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో రామకృష్ణ శర్మ, కంచరపాలెం మెయిన్‌రోడ్డులోని గౌరీ పరమేశ్వరాలయంలో అర్చకులు శ్రీనివాసదీక్షితులు, సుభాష్‌నగర్‌లో ధర్మగర్భ ఆత్మలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు జగన్మోహన్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆఖరి సోమవారం కావడంతో శివాలయాల్లో శివ నామస్మరణ మార్మోగింది. విభూది అభిషేకాలు, బిల్వార్చన, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.



ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



పూజలందుకున్న ఉమానీలకంఠేశ్వరస్వామి

సీతమ్మధార : నక్కవానిపాలెంలో గల శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో భక్తులకు సదుపాయాలు కల్పించారు. అర్చకులు రామారావు శర్మ, ఉమామహేష్ పర్యవేక్షణలో పూజలు చేశారు. నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు గణేష్ నగర్‌లోని శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో చైర్మన్ టీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఏడిద గురునాథ శర్మ, టీఎస్.కుమార్ ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు. కార్యదర్శి ఎంఎస్ ప్రకాశరావు, మాజీ కోశాధికారి బందారు కృష్ణంనాయుడు, మహాలక్ష్మి, రత్న, తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తామని తెలిపారు.

మద్దిపాలెం : గాంధీనగర్ – 2, యువసేన, హరిహర క్షేత్రంలో గల శ్రీ స్పటిక లింగ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించి అభిషేకాలు చేశారు.

సీఐటీయూ సభ జయప్రదం చేయండి

సీతమ్మధార : ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం చేపట్టనున్న ప్రదర్శనను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్ సోమవారం కోరారు. అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా నవంబర్ 26న భారీ ఎత్తున నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చాయని గుర్తు చేశారు. మంగళవారం దొండపర్తి రైల్వే డీఆర్ఎం ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రదర్శనలో కార్మిక వర్గం భారీగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు.